క్లుప్తంగా

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొల్లిపర:పంట భూములను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న కౌలు రైతులు తప్పకుండా ప్రభుత్వం అందిస్తున్న కౌలు రైతు కార్డులు తీసుకుంటేనే వారికి ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాలు పొందేందుకు అర్హత సాధిస్తారని ఏవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతు కార్డు జారీలపై వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బందికి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు అందరూ తప్పని సరిగా కార్డులు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కౌలు కార్డులు పొందడం వల్ల యూరియా, డీఏపీ కొనుగోలు చేయడానికి వీలు కుదురుతుందని తెలిపారు. తహసీల్దార్ జి.సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

బాల సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో చోరీ

తెనాలిరూరల్:మండలంలోని ఎరుకలపూడి బాలసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శుక్రవారం చోరీ వెలుగు చూసింది. సుమారు 85 కిలోల ఇత్తడి సామగ్రి అపహరణకు గురైనట్లు ఆలయ నిర్వాహకులు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. రూ. 30 వేలు విలువ చేసే ఇత్తడి గుండిగ, దబర, గంగాళం, రాగి, ఇత్తడి కలశాలు, చెంబు అపహరణకు గురైనట్లు తెలిసింది. విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆటోనగర్‌లో న్యాయ అవగాహన సదస్సు

తెనాలిరూరల్:ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తెనాలి ఆటోనగర్‌లో న్యాయ అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వలంటీర్ బుడ వెంకయ్య మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు బాలలను పనిలోకి పంపించకూడదని తెలిపారు. పనిలో పెట్టుకున్న యజమాని శిక్షకు గురవుతాడని చెప్పారు. చదువు మధ్యలో మానేసిన పిల్లలను బడికి పంపించాలని సూచించారు. సదస్సులో పారా లీగల్ వాలంటీర్లు క్రాంతి కుమార్ ఘోష్, మట్లపూడి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఐదు ఇసుక టిప్పర్లు సీజ్

కొల్లిపర:ఎటువంటి వే బిల్లు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు టిప్పర్లపై కేసు నమోదు చేసినట్ల ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మండలపరిధిలోని తూములూరు అడ్డ రోడ్డు వద్ద శుక్రవారం సాధారణ తనిఖీలు నిర్వహించారు. గాజుర్లంక నుంచి గుంటూరుకి అక్రమంగా ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తోలుతున్న ఐదు టిప్పర్లను సీజ్ చేశారు. తహసీల్దార్ జి. సిద్ధార్థకు నివేదిక సమర్పించారు. ఒక్కొక్క టిప్పర్ కి రూ.15000 చొప్పున మొత్తం రూ.75000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ నిలిపివేత

కొల్లిపర: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ఉదయం తొమ్మిది గంటల లోపలే విద్యుత్‌తో కూడిన పనులు ఏమైనా ఉంటే ముగించుకోవాలని సూచించారు. విద్యుత్ కోత సమయంలో తమ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్:దాడి ఘటనపై కేసు నమోదైంది. మారిస్‌పేటకు చెందిన పెయింటర్ చిట్యాల మణికంఠపై పాత కక్షల నేపథ్యంలో రిజ్వాన్‌దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితుడు చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు శుక్రవారం నమోదు చేశారు.

అన్ని వర్గాలకు చంద్రబాబు వెన్నుపోటు

- తెనాలిలో వైఎస్సార్ సీపీ 'మహాగర్జన'
- చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ర్యాలీ విజయవంతం
- పట్టణ వీధుల్లో భారీ బైక్ ర్యాలీలో భారీగా పాల్గొన్న పార్టీ శ్రేణులు

తెనాలిలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో శివకుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

తెనాలి:చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల హామీలు అమలు చేయలేదని, విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు, మైనారిటీలు సహా అన్ని వర్గాల ప్రజలను ఈ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ శ్రేణులు శుక్రవారం పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించాయి. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు ప్రకారం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో జరిగిన మహాగర్జనతో తెనాలి వీధులు కిక్కిరిశాయి. బుర్రిపాలెంరోడ్డులోని పెమ్మసాని పెట్రోలు బంకు నుండి ఉదయం 11 గంటలకు బైక్ ర్యాలీ ఆరంభమైంది. బుర్రిపాలెంరోడ్డు, శివాజీచౌక్, గాంధీచౌక్, బోసురోడ్డు, టెలిఫోన్ ఎక్ఛేంజిరోడ్డు, వహాబ్ చౌక్, కొత్త వంతెన మీదుగా మార్కెట్‌సెంటర్‌కు చేరుకుంది. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పార్టీ నేత తాడిబోయిన రమేష్ బైకుపై ర్యాలీలో పాల్గొన్నారు, 'మార్గ మధ్యంలో బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ', 'ఆడపిల్లలకు నెలకు రూ.1500 గోవిందా', నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు గోవిందా' అంటూ ఒక్కో హామీని ఏవిధంగా బూటకం చేసిందీ నినాదాలు చేశారు. ప్రతి సెంటరులోనూ మహిళలు శివకుమార్‌పై పూలు విసిరారు. మార్కెట్ సెంటర్‌కు చేరుకున్నాక కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను దహనం చేశారు. రూరల్ మండలం, కొల్లిపర మండల గ్రామాలు, పట్టణంలోని వివిధ వార్డుల నుంచి వందలాది ద్విచక్రవాహనాల్లో యువత, రైతులు, విద్యార్థులు, ప్రజలు తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. దాదాపు వందమంది మహిళలు ద్విచక్రవాహనాలతో ర్యాలీలో పాల్గొనటం మరో విశేషం. మూడు కిలోమీటర్ల బైక్ ర్యాలీకి గంటంబావు సమయం పట్టింది.

పోలీసు బారికేడ్లను తోసుకుంటూ...

ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ర్యాలీలో బుర్రిపాలెం రోడ్డు నుంచి బోసురోడ్డుమీదుగా చుట్టు తిరిగి రావాల్సివుండగా, పోలీసులు గాంధీచౌక్ సెంటరులో బారికేడ్లను పెట్టి, బందోబస్తుగా ఉన్నారు. నేరుగా మెయిన్‌రోడ్డులోంచి మార్కెట్ సెంటర్‌కు వెళ్లాలని ఆదేశించారు. దీంతో శివకుమార్‌తో సహా పార్టీ శ్రేణులు బారికేడ్లను తోసేసుకుంటూ ముందుకు సాగారు. బోసురోడ్డులోంచి ర్యాలీని కొనసాగించారు. అక్కడ ఓ పోలీసు అధికారి శివకుమార్‌తో వాగ్వాదానికి దిగినా లెక్కజేయలేదు.

ప్రజాగ్రహానికి నిదర్శనమే భారీ ర్యాలీ...

సమన్వయకర్త , మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, నిరసన ర్యాలీలో వందలాదిమంది కదం తొక్కడమే చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజాగ్రహానికి నిదర్శనమని చెప్పారు. పింఛను మినహా సూపర్‌సిక్స్‌లో ఏ హామీని కూటమి నేతలు నెరవేర్చలేదన్నారు. అది కూడా గత రెండేళ్లుగా ఒక్క కొత్త పింఛను ఇవ్వకపోగా గతంలో ఇస్తున్న 37,474 పింఛన్లను 36 వేలకు తగ్గించి ఇస్తున్నారని గుర్తుచేశారు. విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవటం, నిరుద్యోగ భృతి ఊసే లేకపోవటం, ఆడబిడ్డ నిధిని అదృశ్యం చేయటం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. ఇప్పటికైనా హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టంచేశారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కాకుమాను సదాశివరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల హామీలను విస్మరించి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతిపరులపై కేసులు బనాయించటమే పనిగా పాలన చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పట్టణ, తెనాలి, కొల్లిపర మండలాల అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కల్లం వెంకటప్పారెడ్డి, పార్టీ నాయకులు పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గెడ్డటి సురేంద్ర, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, మైలా విజయ్‌నాయుడు, తాడిబోయిన రమేష్, బూరెల దుర్గా, కొర్ర యశోద, కొంగర రాగమంజరి, పలువురు మాజీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎస్ఐతో శివకుమార్ వాగ్వాదం

వ్యర్థాలను త్వరగా తరలించండి

మున్సిపల్ కమిషనర్ జెఆర్ అప్పలనాయుడు

తెనాలిఅర్బన్:తూర్పు కాల్వల్లో పూడికతీత పనుల్లో వచ్చిన వ్యర్థాలను వెంటనే బయటకు తరలించాలని మున్సిపల్ కమిషనర్ జెఆర్ అప్పలనాయుడు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తూర్పు కాల్వను పరిశీలించారు. కాల్వల్లో వచ్చిన మట్టి, ఇతర వ్యర్థాలను శివారు ప్రాంతాలకు తరలించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో నివసించే ప్రజలు ఎవరూ కాల్వల్లో వ్యర్థాలు వేయవద్దని సూచించారు. దీనివలన నీరు కలుషితమై రైతులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈలు ఆంజనేయరాజు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన

తెనాలి టౌన్:ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతుకు లాభసాటిగా ఉంటుందని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు అని ఎంపీడీవో అత్తోట దీప్తి తెలిపారు. రూరల్ మండలం ఎరుకలపూడి గ్రామంలో మహిళా రైతు విజయలక్ష్మి తన పొలంలో సేద్యం చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని శుక్రవారం ఎంపీడీవో అత్తోట దీప్తి, మండల వ్యవసాయ అధికారి కె. సుధీర్ బాబు, ఉద్యానవన శాఖ అధికారి యు. శ్రీ నిత్య సందర్శించారు. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా పొలంలో పండిస్తున్న వివిధ రకాల పండ్లు, కూరగాయల సాగును పరిశీలించారు.

మృతదేహానికి అంత్యక్రియలు

తెనాలి:పట్టణానికి చెందిన శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి ఆధ్వర్యంలో మరో అనాథ శవానికి అంత్యక్రియలు జరిపారు. ఈనెల 8వ తేదీన రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఆనవాలు పట్టేందుకు వీలులేకుండా ఉంది. తెనాలి జిల్లా వైద్యశాలలో మృతదేహాన్ని ఉంచి, నాలుగురోజులుగా విచారించారు. ఎలాంటి ఆచూకీ తెలియకపోవటంతో క్షీణిస్తున్న ఆ మృతదేహానికి అంత్యక్రియలు చేయాలని శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనును కోరారు. దీనితో సేవాసమితి సభ్యులను కలుపుకుని శుక్రవారం ఆ మృతదేహాన్ని బుర్రిపాలెంరోడ్డులోని మహాప్రస్థానానికి తరలించారు. మల్లెల వాసు, పోతురాజు, శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ

బీఎల్‌వో, సూపర్‌వైజర్ల శిక్షణ సమావేశంలో ఆర్డీవో శ్రీరమణి

తెనాలి:ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని తెనాలి ఆర్డీవో కె.శ్రీరమణి సూచించారు.ఓటరు జాబితా సవరణపై అమలు జరగనున్నప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్)-2026 కార్యక్రమం నిర్వహణపై బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు శుక్రవారం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెనాలి ఆర్డీవో కె. శ్రీరమణి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చాలని సూచించారు. ఓటరు వివరాల సవరణ, మార్పులు, తొలగింపుల విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, కొల్లిపర తహసీల్దార్ సిద్ధార్థలు బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

పాలకులు తీరు మార్చుకోవాలి

వైఎస్సార్ సీపీ నేతలు

కూటమి ఎన్నికల మేనిఫెస్టో ప్రతుల దహనం చేస్తున్న నాయకులు

తెనాలి:చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ర్యాలీలో ప్రజాగ్రహాన్ని చూసి పాలకులు ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గెడ్డటి సురేంద్ర అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసగించిన కూటమి పాలకుల తీరుకు నిరసనగా పార్టీ పిలుపు ప్రకారం తెనాలిలో శుక్రవారం జరిగిన భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మార్కెట్ సెంటర్లో కూటమి ప్రభుత్వ ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను దహనం చేశారు. అనంతరం పార్టీ నాయకులు మీడియాతో మాట్లాడారు. సురేంద్ర తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం సంక్షేమం ఇవ్వకపోగా ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారనీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా లక్షలాది విద్యార్థులను అవస్థలపాలు చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల హామీలను అమలుచేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిన ప్రజల ఆగ్రహం ర్యాలీలో ప్రతిబింబించిందని చెప్పారు. పార్టీ తెనాలి పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి మోసానికి ఆగ్రహం చెందిన విద్యార్థి, యువజనులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలియజేశారని చెప్పారు. కొల్లిపర మండల అధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడలు వంచి, జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పరిపాలనను తెచ్చుకునేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొర్రా యశోద, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు షేక్ దుబాయ్‌బాబు, కొడాలి క్రాంతి, పెదలంక వెంకటేశ్వర్లు, ఉన్నవ అనీష్, కొంగర రాగమంజరి, చింకా సురేష్, లక్ష్మణ్, ధరణికోట మల్లికార్జునరావు, కొలా వాసు వివిధ వర్గాలకు ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని వివరించారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పార్టీ నేతలు మద్దాళి శేషాచలం, శానంపూడి రఘురామిరెడ్డి, జలగం రామకృష్ణ, పెసర్లంక రమణ, కొల్లా గురునాథగుప్త, చంచల రామిరెడ్డి, బొల్లిముంత పోతురాజు, పచ్చవ రమేష్, బొంతు వేణుగోపాలరెడ్డి, గొర్రెపాటి వేణుగోపాలరెడ్డి, జొన్నల శివారెడ్డి, గడ్డం సుబ్బారెడ్డి, బొంతు నరేంద్ర రెడ్డి, ఈదా యశ్వంత్‌రెడ్డి, కాళిదాసు సత్యం, బ్రదర్ అనందన్న, గొరికపూడి బాలరాజు, నీలి అజయ్‌కుమార్, పల్లె రోహిత్ శామ్యూల్, కుర్రా జస్వంత్‌యాదవ్, పెచ్చింగ్ సుభాని, మంద్రు రాజు, యండ్రపాటి స్టాలిన్, దేవరపల్లి నాగభూషణం, షేక్ జకీరా, షేక్ నాగూర్‌బి, మంద్రు రాజు, చుక్కా ఆనంద్, అక్కిదాసు కిరణ్, నాలాది బుజ్జిబాబు, నాలాది ప్రభాకర్, వేమూరి కిశోర్, తురకా శాంతి, ఎం.ఇందిరా ప్రియదర్శిని, సిద్ధాబత్తుని శాంతి, షేక్ అజ్మల్, బండ్లమూడి నాని, కమాదుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి భారీగా ఖర్చు

తెనాలిఅర్బన్:నియోజకవర్గంలో రూ.1225 కోట్లు సంక్షేమం, అభివృద్ధి కోసం వెచ్చించినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బోసురోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారంఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెనాలి నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.244 కోట్లు, సంక్షేమం కోసం రూ.981 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. వీటిలో రోడ్ల నిర్మాణం కోసమే రూ.136 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 83,866 మంది స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసినట్లు చెప్పారు. 2739 పొదుపు సంఘాలకు రూ.366 కోట్లు రుణాలను, సీఎంఆర్ఎఫ్ కింద 588 మందికి రూ.5.67 కోట్ల విలువ చేసే చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ముందుగా నందివెలుగు నుంచి తెనాలి వరకు నిర్మిస్తున్న తారురోడ్డు పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తోట దుర్గాప్రసాద్, వివిధ కార్పోరేషన్ డైరెక్టర్లు షేక్ జాకీర్ హుస్సేన్, జెట్టి గుణ, శాస్త్రి, తోటకూర రమణరావు, రఘురామయ్య, పసుపులేటి మురళి, జనసేన పార్టీ నాయకులు హరిదాసు గౌరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

జూలై 7 కార్యక్రమం జయప్రదం చేయాలి

తెనాలిరూరల్:ప్రకాశం జిల్లా ఈదుమూడిలో జూలై 7న జరిగే మాదిగల పుణ్యక్షేత్ర శంకుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కిన్నెర నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యాలయంలో జాతీయ అధికార ప్రతినిధి ఉన్నం ధర్మారావు మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు చిలువూరు నాగరాజు మాదిగ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. మాదిగల పుణ్యక్షేత్రంలో ఆదిజాంబవంతుడు, అరుంధతి, కక్కయ్య విగ్రహాలతో పాటు ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని తెలిపారు. కవులు, కళాకారులు, మేధావులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జ్ కొమరాల శ్రీనివాస్ మాదిగ, నియోజకవర్గ అధ్యక్షుడు పిడపర్తి గోపాలకృష్ణ మాదిగ, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండముది శ్రీను మాదిగ, ఏసుపోగు రమణమూర్తి మాదిగ, అనిల్ మాదిగ, రవీంద్ర మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో విద్యుత్ నిలిపివేత

తెనాలిటౌన్:రూరల్ మండలం అంగలకుదురు, సంగం జాగర్లమూడి, కొలకలూరు, నందివెలుగు, అంగలకుదురు, చావావారిపాలెం, కోపల్లె, గుడివాడ, ఎరుకులపూడి నందివెలుగు, కొలకలూరు కాజీపేట, హాఫ్ పేట, కంచర్లపాలెం, కఠెవరం గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని రూరల్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్‌లలో నెలవారీ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన డాక్టర్ వెలగా

జయంతి సభలో డాక్టర్ డొల్లు పారినాయుడు



తెనాలి:రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల అభివృద్ధికి డాక్టర్ వెలగా వెంకటప్పయ్య జీవితాంతం కృషి చేశారని పార్వతీపురంలోని జట్టు ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ డొల్లు పారినాయుడు అన్నారు. ఆయన కాంస్య విగ్రహాన్ని స్వస్థలంలోని తెనాలి బండ్‌పై కుటుంబసభ్యులు ఏర్పాటు చేయటం ముదావహమని చెప్పారు. తెనాలికి చెందిన గ్రంథాలయ ఉద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య 95వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో జరిగిన సభకు ఆలపాటి కళావతీ రవీంద్ర పీఠం అధ్యక్షులు అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు వందమంది శిష్యులను కలిగివున్న వెంకప్పటయ్య తన సేవలతో గ్రంథాలయ గాంధీగా గుర్తింపును పొందారని చెప్పారు. పీఠం శాశ్వత సభ్యులు పావులూరి శ్రీనివాసరావు తన ప్రసంగంలో గ్రంథాలయ విజ్ఞాన సర్వస్వంగా వెలుగొందిన వెంకటప్పయ్య శతాధిక గ్రంథాలను రచించారని గుర్తుచేశారు. తొలుత వెలగా కుటుంబసభ్యులు వెలగా వీరయ్య, వెలగా వెంకట్రావు, వెలగా మానవేంద్రలు జ్యోతి ప్రజ్వలన చేశారు. గాన కళారత్న వెంపటి సత్యనారాయణ, విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, మొవ్వా సుబ్బారావు, వెలగాపై పద్యాలను ఆలపించారు. ఓంకార్ ప్రసాద్, వాసుదేవరావు, గ్రంథాలయ సిబ్బంది కె.పూర్ణచంద్రరావు, ఎస్.లావణ్యసుధ, కె.పద్మావతి పాల్గొన్నారు. సభకు ముందు తెనాలి బండ్‌పై గల డాక్టర్ వెంకటప్పయ్య విగ్రహానికి పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు.

బిల్లులు పెట్టుకోవడానికే పనులు చేస్తున్నారా?

ఇరిగేషన్ ఈఈ సుధాకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్:తూర్పుకాల్వల్లో పూడికతీత పనులు సంతృప్తికరంగా లేవు. కేవలం బిల్లులను పెట్టుకుంటేనందుకే పనులు చేస్తున్నట్లు అనిపిస్తుంది. ఇలా అయితే తెనాలిలో పనిచేయవద్దని ఇక్కడి నుండి వెళ్లిపోవాలంటే రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇరిగేషన్ ఈఈ సుధాకర్‌ను హెచ్చరించారు. కొత్త వంతెన వద్ద తూర్పు కాల్వ పూడికతీత పనులను శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. కాల్వల్లో ఒక జేసీబీతోనే పనిచేస్తూ ఉండటాన్ని గమనించిన ఆయన మరొకటి ఎక్కడ అంటూ ప్రశ్నించారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ కాల్వలను బాగు చేయాల్సిన బాధ్యత మీకు లేదా అంటూ ప్రశ్నించారు. అధికారుల తీరు పూర్తిగా మారాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే పుట్‌పాత్‌లపై మామిడిపండ్ల వ్యాపారులను ఎవరి ప్రమేయంతో ఇక్కడ వ్యాపారులు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. పుట్‌పాత్‌లను అక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వెంటనే నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడును ఆదేశించారు. అనంతరం గాంధీచౌక్ నుంచి మార్కెట్ వరకు పర్యటించి వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, పోలీసు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి

తెనాలిరూరల్:తెనాలి రైల్వే స్టేషన్ పరిశీలనకు శుక్రవారం వచ్చిన దక్షిణ కోస్తా రైల్వే జీఎం సందీప్ మాథుర్‌ను ప్రయాణికుల సంఘం సభ్యులు కలిశారు. ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి చర్చించారు. నాలుగు-ఐదు ప్లాట్‌ఫాంలపై విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని విన్నవించారు. వెస్ట్ బుకింగ్ కౌంటరు వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. తెనాలి జంక్షన్‌లో రేపల్లె, పరిసర ప్రాంతాల ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వందే భారత్ రైళ్లను తెనాలిలో ఆపాలని కోరారు. గుంటూరు నుంచి బయలుదేరే పల్నాడు ఎక్స్‌ప్రెస్, విజయవాడ నుంచి బయలుదేరే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను తెనాలి నుంచి నడపాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీఎంకు వినతిపత్రం అందజేశారు. యడ్లపల్లి వెంకటేశ్వరరావు, సభ్యులు జీఎం కలిశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్